ప్రకృతిశాస్త్రంలో వివరించబడిన శక్తి-దానిని పరిపాలించే ధర్మములు చూస్తే, భగవచ్ఛక్తికి దానికి చాలా సామ్యం ఉన్నట్లు తోస్తుంది. అదీ మార్పులు పొందుతుంది. దాన్ని కొత్తగా సృష్టించడానికి వీలులేదు. ఉన్నదాన్ని నాశనంచేయడానికి వీలులేదు. బ్రహ్మస్వరూపమూ, భగవచ్ఛక్తీ కూడా అటువంటివే! భగవంతుణ్ణి గజేంద్రమోక్షంలో గజేంద్రుడు చక్రిగా సంభావించాడు. అచేతనమయిన దాంట్లో చైతన్యం కలిగించడం, స్తబ్ధమయిన దానిని సంచలితం చేయడం, అనంతమయిన విశ్వకర్మ పరిభ్రమణానికి ప్రారంభం చెయ్యడం భగవచ్ఛక్తికి లక్షణములు అనుకుంటే, మార్క్సు సంభావించిన ప్రకృతీ అశక్తి ఒకటేననుకుంటే, మార్క్సు సిద్ధాంతం కర్మసిద్ధాంతంలాగే, ప్రకృతిశాస్త్ర సిద్ధాంతాల్లాగే- జీవితరహస్యాల నన్నింటినీ వివరించగలుగుతుంది.

మార్క్సు చారిత్రికసంభావన వైజ్ఞానికమయిందని ఆయన అనుయాయులు అంటారు. విజ్ఞానానికి పునాది న్యూటన్ పండితుడి సిద్ధాంతాలు. శక్తిసంభావనా, దానితో సమన్వయం లేనంతవరకు అది వైజ్ఞానికం కాలేదు.

అంతవరకు ఆ మార్క్సును ఒక నిర్లోపుడయిన దైవంగానూ, ఆయన విశ్వాసాలను యథాతథంగా మతవిశ్వాసాలలాగనూ విశ్వసించి, వాటిని ఆధారంచేసుకుని మాత్రమే సంఘాన్ని మారుస్తామనే వారికి భారత ప్రజానీకంహృదయంలో తావులేదు, ఉండదు. భారత ప్రజ ఊహను ఆకర్షించడానికీ, నూతనపంథాలో నడిపించడానికీ వారి ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఒక నూతన స్వరూపం ఇవ్వడం అవసరం. సంఘుస్వామ్య సంభావనకు మార్క్సు అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ సహాయకారులు కావచ్చునేమో కాని-ఏకైక ఆధారములు కావడానికి వీలులేదు.

---

# న్యాయం త్రిప్పటలు

'రాఘవ'

వేసవికాలం - మామిడికాయల అన్వేషణార్థం తోటల్లోకి బయలుదేరాం, మామూలుగానే ఆనాటి సాయంకాలంకూడా: దొంగతనానికి మాత్రం కాదు, దొరతనానికే. ఒకటి రెండు కాయల చొప్పున డబ్బిచ్చి కొనుక్కొందుకు.

మేం వెళ్ళిన తోటలో ఒక బోడి నుయ్యి వుంది. లోపల రెండు బారల పొడుగున ఒక నల్ల త్రాచు పడగ విప్పి ఆడుతూంది చల్లగాలికి.

'పాముర్రా నూతులో' అన్నాడు సత్యనారాయణ.

'ఏదీ' అంటూ తొంగి చూశాను, ఆతుర్దాగా భయవిభ్రమాలతో.

'ఓస్! ఇదేనా. చూడండి. రాయి పుచ్చుకుని దెబ్బకి దానిని ఫైసలు చేస్తా' నంటూ, నేను వద్దని ఎంతచెప్పినా వినకుండా, దాన్ని గురిచూచి కొట్టాడు వీరభద్రయ్య.

'అమ్మనొయ్యో, ఎంతపని చేశాడు! ఆ రాయి దానికి చావు తీసుకరాకపోతే—' అనుకుంటూ లోపలకు చూశాను. ఆ రాయి దాని కసలు తగలే లేదు! అది మా ముగ్గురిని ఒకసారి చూచి కలుగులో దూరింది.

మేము మామిడికాయ లేవో కొనుకున్నామే గాని నాకు వాటి మీద దృష్టే లేదు. ఆ పాము పగ పట్టుతుంది, మమ్మల్ని కరుస్తుంది. ముగ్గుర్నీ కరుస్తుందో లేక అతణ్ణే కరుస్తుందో అన్న ఆలోచనతో, అదెక్కడ వెంబడిస్తూందోనని వెనక్కి వెనక్కి చూచుకుంటూ నడుస్తున్నాను. నడుస్తున్నా నన్న మాటేగాని వాళ్ళతోటి కులాసాగా మాట్లాడ లేకపోతున్నాను. నాలోని భయాన్ని గుర్తించి - 'ఈయన ఉట్టి పిటికి రా సత్యనారాయణా.' అని భద్రం వెక్కిరిస్తూన్నా, ఎలాగేనా ఇల్లు చేరితే చచ్చి బ్రతికిన

వాళ్లలో లెక్క అనుకుంటూ, పాము గాని వెంబడిస్తుందేమో చూసుకుంటూ వెడుతున్నాను.

అనుకున్నంతా జరిగింది! పాము వందగజాల దూరంలో మావేపే వస్తూండడం కనిపించింది. 'వీరభద్రయ్యోయ్! చంపేశావయ్యా - అదిగో పాము, మనల్ని కరిచేస్తుంది - ఏంపనిచేశావు... ఇప్పు డెలాగా?' నోటమాటే పెగల్లేదు. మొత్తానికెలాగో అన్నాను.

పాము ఎంతసేపట్లో వస్తుంది - మొదట నా వేపే, అదేం కర్మమోగాని!

'అఁ! అఁ! కరవకు! కరవకు! నేను కాదు నిన్ను కొట్టింది - అదుగో వీరభద్రయ్యా' ఎలాగో ధైర్యంచేసి అనగలిగాను.

త్రాచు వీరభద్రయ్యవేపు తిరిగింది.

'నేను కాదు ! నేను కాదు ! అతడే నిన్ను కొట్టింది. అబద్ధం ఆడుతున్నాడు. అతన్నే కరు' అని వీరభద్రయ్య.

'అరి వీడి తస్సాదియ్యా! ఇన్నాళ్ళూ వీడి స్నేహంచేస్తే వీడు నా ప్రాణానికే ఎసరు పెడుతున్నాడే' అనుకుంటూ, 'సర్పరాజమా! ధర్మమాలోచించు - నేనుకాదు నిన్నుకొట్టింది. కావలిస్తే సత్యన్నారాయణ నడుగు' భయంతో అన్నాను.

'ఏమో బాబు! నాకు తెలియదు' - తన సంకుచితత్వాన్ని బయటపెట్టాడు సత్యన్నారాయణ.

పాము గంభీరంగా అంది: 'తోటమాలి దగ్గరకు పదండి. అతడు నిజం చెపుతాడు ఎవరుకొట్టిందీ.' చస్తామా అనుకుంటూ వాడుమొగా లేసుకుని బయలుదేరాం. తోటమాలి భద్రయ్యే కొట్టాడని చెప్పాడు. 'అమ్మయ్య' అనుకుంటూ గుండెల మీద చెయ్యి వేసుకున్నాను. మళ్ళీ నాన్నని, ఇంటిని, అందరిని చూడొచ్చునని నిర్ణయించుకున్నాను.

వీరభద్రయ్య-'దుష్టజంతువును శిక్షించవచ్చు. ప్రాణరక్షణార్థం ఏం చేసినా తప్పులేదు. నీలాటివి మమ్మల్ని చంపుతాయి. అందుకనే నీకు శిక్ష విధిద్దా మనుకొన్నాను. కావలిస్తే కోర్టులో ఫిర్యాదు చేసుకో. నా తప్పువుంటే కరవొచ్చు' అని యుక్తిగా తప్పించుకున్నాడు— వీడి యుక్తి పాడుగాను !

నా మీద అన్యాయంగా నేరం మోపినందుకు నేనొక దావా, తన్ను కొట్టినందుకు పామొక దావా పడేశాము కోర్టులో — పాముకి నేను, నాకు పాము సాక్ష్యం.

మొదట పాముకేసు విచారణ— భద్రయ్య డబ్బుతో తనవేపు తీర్పు చెప్పించుకున్నాడు. పాము ఏమీ హానిచేయక పోయినా చేస్తుందనే భయంతో దాన్ని చంప ప్రయత్నించవచ్చుట ! పాము ఓడిపోయింది. వీరభద్రయ్య పరువునష్టానికని పాము నెత్తిమీద మణి పుచ్చుకున్నాడు.

నా దావాలో కోర్టు న్యాయంగా నాకే గెలుపు చెప్పింది. నేను మణిని కోరాను, జరిమానాక్రింద. విధిలేక యిచ్చాడు భద్రయ్య.

పాము తన ఓటమికి బుర్ర నేలకేసి కొట్టుకు చచ్చింది. మేమంతా పెదమొగాలతో ఇంటికి బయలుదేరాం. రైలు దిగి ఇంటికి వచ్చే త్రోవలో పుంత ఒకటి వుంది.

ఉడుకుమోత్తనంతో తక్కిన ఇద్దరూ కూడబలుక్కొని, నా చేతిలో మణి లాక్కుని, నన్ను చితక తన్నారు—


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు



(Estd: 1907)

జారీచేసి చందావేయబడిన

| | |
|---|---|
| మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనం | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,

కార్యదర్శి.